సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



పునరుజ్జీవనం అయ్యేనా..?
యాసంగి పంటలకు నీటిని విడుదల చేయడంతో శ్రీరాంసాగర్ నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది.
- 8లో ▸



సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.7 /27.7

వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.



న్యూస్‌రీల్

డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి



ఖలీల్‌వాడి : జిల్లాలోని డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో పాదచారుల వంతెనను నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌ను ఎంపీ అరవింద్ కోరారు. గురువారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో జీఎంతో భేటీ అయ్యారు. రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేకపోవడం వల్ల ప్లాట్ ఫామ్‌లు మారడానికి ప్రయాణికులు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ అర్వింద్ రైల్వే జీఎంకు వివరించారు. దీనివల్ల డిచ్‌పల్లి, మోపాల్ పరిధిలో ఉన్న అనేక గ్రామాలకు మేలు జరు గుతుందన్నారు. ఆర్మూర్, మాధవ్‌నగర్, అ ర్సపల్లి, బోధన్ ఆర్‌వోబీల నిర్మాణాల ప్రస్తు త స్థితిగతులు, ఆర్మూర్–ఆదిలాబాద్, బోధన్ – బీదర్ రైల్వే లైనులకు సంబంధించి పలు పెండింగ్ అంశాలను జీఎంతో చర్చించారు.

5 లక్షలకు చేరువలో కంటి వెలుగు పరీక్షలు

నిజామాబాద్ సిటీ : జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు అయిదు లక్షల మందికి చేరువవుతోంది. గత జనవరి 19న జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం కాగా ఇప్పటివరకు 4,95,544 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో మగవారు 2,21765 మంది, ఆడవారు 2,73,779 పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో రీడింగ్ (దగ్గరి చూపు) అద్దాలు 66,533 మందికి, దూరం చూపు అద్దాలు 46131 మందికి పంపిణీ చేశారు. మరో 15,758 మందికి దూరపు చూపు అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. కంటి వెలుగు శిబిరాలు జూన్ నెల వరకు పొడగించారు.

వీధి వ్యాపారులకు రూ. 50 వేల రుణాలు



నిజామాబాద్ నాగారం : నగరంలో ఉన్న వీధి వ్యాపారులకు రూ. 50 వేల వరకు ప్రభుత్వం ఇస్తున్న రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలని ఇన్‌చార్జి కమిషనర్ అలీం తెలిపారు. గురువారం డిప్యూటీ కమిషనర్ చాంబర్‌లో మెప్మా, బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశమయ్యారు. గతంలో వీధి వ్యాపారులకు ప్రభుత్వం మొదట రూ. 10 వేలు, రూ.20వేలు తీసుకుని సక్రమంగా చెల్లించిన వారికి రూ. 50 వేలు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే నాందేవ్‌వాడ, ఉషాప్రసాద్ థియేటర్ ప్రాంతంలో వీధి వ్యాపారుల కోసం 30 దుకాణాలు ఉన్నాయని వారంలోగా వ్యాపారం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, డీఎంసీ శోభరాణి, సీఈవో, బ్యాంకరు పాల్గొన్నారు.

ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలి



డిచ్‌పల్లి : జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యలు ఆర్థికంగా ఆదాయం పెంపు మార్గాలపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో ఇందూరు జిల్లా మహిళా సహకార సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా డీఆర్‌డీవో హాజరై మాట్లాడారు. జిల్లాలో 64 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో జిల్లా సమాఖ్య ద్వారా పప్పుదినుసుల యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా 17రకాల ఆహార యూనిట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు విప్లవకుమారి, కోశాధికారి లక్ష్మి, కార్యదర్శి వనిత, డీపీఎం లు శ్రీనివాస్, సంధ్యారాణి తదితరులున్నారు.



అక్రమాలు నిగ్గు తేలేనా..?

- సుదీర్ఘ కాలం తర్వాత టీయూ పాలకమండలి సమావేశం
- ఉన్నత విద్యాశాఖ ఆదేశాలతో..
- ఆమోదం లేని నియామకాలు, అనుమతి లేని కొనుగోళ్లతో వీసీ ఇష్టారాజ్యం
- సమావేశంలో గట్టిగా చర్చించేందుకు సిద్ధమైన ఈసీ సభ్యులు
- హడావుడిగా సమావేశం ఏర్పాటుతో వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశం

ప్రతి మూణ్నెళ్లకోసారి నిర్వహించాల్సిన తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం ఏకంగా 17 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఆర్థిక అంశాలు, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి ఈసీ ఆమోదం, అనుమతి తప్పనిసరి. అయినప్పటికీ ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ వీసీ ముందుకెళ్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీకి ఉన్నత విద్యామండలి కార్యదర్శి నుంచి లేఖ రావడంతో హడావుడిగా ఈసీ సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు. దీంతో క్యాంపస్‌లో ప్రతి ఒక్కరూ ఈ విషయమై చర్చించుకుంటున్నారు. కాగా ప్రొఫెసర్ రవీందర్ 2021 జులై 27న టీయూ వీసీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన తీసుకుంటున్న నిర్ణయాలన్నీ వివాదాస్పదమయ్యాయి. సదరు వివాదాస్పద నిర్ణయాలకు తలూపకపోవడంతో అప్పటికే రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ నసీంను రెండు నెలలకే తప్పించారు. తనకు అత్యంత సన్నిహితుడైన కనకయ్యను రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆ వెంటనే అక్రమాల పర్వం మొదలుపెట్టారు. అవుట్‌సోర్సింగ్ పేరిట ఇష్టారాజ్యంగా నియామకాలు చేశారు. అదేవిధంగా 2014 వివాదాస్పద నియామకాల తుట్టెనూ కదిపారు. 2014లో నియామకమైన అందరినీ వదిలేసి ప్రొఫెసర్‌గా నియమితుడైన ఒక ఆచార్యుడికి నోటిఫికేషన్‌లో లేని పోస్టుకు సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు తెలిసింది. ఈ విచ్చలవిడి నేపథ్యంలో వర్సిటీల్లో 2014 జూన్ 2 తర్వాత ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని, రాష్ట్ర అవతరణ తరువాత జారీ చేసిన ఉత్తర్వులను ఉటంకిస్తూ 2021 సెప్టెంబర్ 24న రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్సిటీలకు ఆదేశాలిచ్చింది. నియామకాలు చేస్తే వర్సిటీ వీసీలే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వీసీ, రిజిస్ట్రార్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరును 'సాక్షి' ఎండగట్టడంతో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ రంగంలోకి దిగి హుటాహుటిన 2021 అక్టోబర్ 30న తెయూలో ఈసీ మీటింగ్ పెట్టారు. వీసీ తీరును ఎండగట్టడంతో పాటు కనకయ్య నియామకాన్ని రద్దు చేశారు. అక్రమంగా నియామకమైన 130 మంది అవుట్ సోర్సింగ్ పోస్టులను రద్దు చేశారు. అప్పటికప్పుడు ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించారు. తరువాత 2021 నవంబర్ 27న ఈసీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఆ సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పన, వర్సిటీలో సిబ్బంది వినియోగం తదితర అంశాలపై ఒక కమిటీ వేసింది. అయితే అవి ఆచరణలోకి రాకముందే రిజిస్ట్రార్‌గా యాదగిరిని తప్పించి, ప్రొఫెసర్ శివశంకర్‌ను నియమించారు.

లెక్కలేనితనం..



అనుమతి లేకుండా ఒక్క పైసా ఖర్చు చేయరాదని, ఎలాంటి నియామకాలు, పదోన్నతులు చేపట్టరాదని స్పష్టం చేస్తూ 2021 డిసెంబర్ 16న ఈసీ ఒక లేఖ పంపింది. అయితే వీటన్నింటినీ లెక్కలోకి తీసుకోకుండా వీసీ రవీందర్ కోట్లాది రూపాయల వస్తువులు ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేశారు. ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టారు. ఈ క్రమంలో ఆగస్టులో శివశంకర్‌ను తప్పించి, 2014లో వివాదాస్పదనియామకాల ద్వారా ప్రొఫెసర్ అయిన విద్యావర్ధినిని రిజిస్ట్రార్‌గా నియమించారు. అప్పటి నుంచి కొనుగోళ్లు, అక్రమ నియామకాలు, పదోన్నతులు అడ్డు అదుపు లేకుండా సాగుతున్నాయి. అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను ఇష్టారాజ్యంగా పెంచారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈసీ సమావేశం లేకుండా నెట్టుకొద్దామనుకున్న నేపథ్యంలో హఠాత్తుగా ఈ నెల 19న ఈసీ సమావేశం కోసం ఉన్నతవిద్యా శాఖ నుంచి లేఖ రావడం గమనార్హం. దీంతో అక్రమంగా పదోన్నతులు, వేతనాల పెంపు పొందిన వారిలో ఆందోళన మొదలైంది.

ఆత్మీయ సమ్మేళనాలకు ముందే..

- బోధన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో తీవ్ర విభేదాలు
- పట్టణంలో ఎమ్మెల్యే వర్సెస్ మున్సిపల్ చైర్‌పర్సన్
- ఎడపల్లి, నవీపేట, సాలూర మండలాల్లోనూ శ్రేణుల మధ్య విభేదాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బోధన్ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. ఎన్నికలకు కేవలం ఏడు నెలల సమయం మాత్రమే ఉండడంతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని పార్టీ నాయకత్వం సూచించింది. కాగా బోధన్ నియోజకవర్గంలో మాత్రం ఇప్పటివరకు ఈ సమ్మేళనాలు ప్రారంభం కాలేదు. అయితే వర్గ విభేదాలు మాత్రం అన్నిచోట్ల తీవ్రంగానే బహిర్గతం అవుతున్నాయి. తాజాగా ఎమ్మెల్యే షకీల్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, ఆమె భర్త శరత్‌రెడ్డి మధ్య నెలకొన్న విభేదాలు మరింతగా రచ్చకెక్కాయి. గత ఏడాది పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు సమయంలో ఎమ్మెల్యే, కౌన్సిలర్ శరత్‌రెడ్డి మధ్య ఉన్న విభేదాలు బయటపడ్డాయి. శివసేన నాయకుడితో ఎమ్మెల్యే అంతర్గత ఒప్పందం చేసుకుని తమను బదనాం చేస్తున్నట్లు శరత్‌రెడ్డి ఆరోపించారు. తరువాత గత మార్చి7న ఎమ్మెల్యే పుట్టినరోజు ఫ్లెక్సీల్లో పద్మ, శరత్‌రెడ్డిల ఫొటోలు పెట్టలేదు. దీంతో గత మార్చి 13న ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా శరత్‌రెడ్డి పెట్టిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో లేదు. తాజాగా శరత్‌రెడ్డి తల్లి తూము శివమ్మ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ చలివేంద్రాలు ఏర్పాటు నేపథ్యంలో ఎమ్మెల్యే ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంతో ఎమ్మెల్యే షకీల్, శరత్‌రెడ్డి మధ్య ఉన్న విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే ఫొటో లేని విషయమై సీఐ, ఏసీపీ శరత్‌రెడ్డిని గట్టిగా ప్రశ్నించడంతో.. శరత్‌రెడ్డి పోలీసుల తీరుపై ఆరోపణలు చేశారు. ప్రైవేటు కార్యక్రమం ఫ్లెక్సీ విషయంలో పోలీసులు ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించడమేమిటని శరత్‌రెడ్డి ఆక్షేపించారు. గతంలోనూ ఎమ్మెల్యే తనను ఒక రోజంతా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని శరత్‌రెడ్డి చెప్పారు. తమకు మంచి పేరొస్తుందన్న అక్కసుతోనే ఎమ్మెల్యే ఇలా చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే సతీమణి అధికారిక కార్యక్రమాల్లో సెక్యూరిటీ, ఎస్కార్ట్‌తో యథేచ్ఛగా తిరుగుతూ, మరోవైపు తమను మాత్రం ఇబ్బందుల పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. పైగా తనపై రౌడీషీట్ తెరిచేందుకు ఎమ్మెల్యే ఆలోచన చేస్తున్నట్లు శరత్‌రెడ్డి అంటున్నారు. అవిశ్వాసం పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారని, అయినప్పటికీ తమకు ఎలాంటి ఇబ్బంది లేదంటున్నారు. తమకు 23 మంది కౌన్సిలర్ల మద్దతు బలంగా ఉందన్నారు.

ఇతర మండలాల్లో..

ఎడపల్లి మండలంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత ఎల్లయ్య యాదవ్, ఎడపల్లి సర్పంచ్ మాధవి శ్రీనివాస్ వర్సెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేరడి శ్రీరామ్ వర్గాల మధ్య పోటాపోటీ నెలకొంది. ఇటీవల ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌లోనే బాహాబాహీకి దిగడం గమనార్హం. అలాగే నవీపేట మండలంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ వర్సెస్ జెడ్పీటీసీ సవిత బుచ్చన్న, సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. సాలూర మండలంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ వర్సెస్ సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ వర్గీయుల మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఆత్మీయ సమ్మేళనాల్లో ఇంకెన్ని గ్రూపుల విభేదాలు బహిర్గతమవుతాయో అనే చర్చ నడుస్తోంది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు సత్యాగ్రహ సభ

- చలో మంచిర్యాల్ సక్సెస్ చేయాలి
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సుభాష్‌నగర్: మోదీని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై కక్ష కట్టారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సత్యాగ్రహ సభ ఏర్పాటు చేశారని తెలిపారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ సభ్యత్వ రద్దు, అధికారిక నివాసాన్ని ఖాళీ చేయమని నోటీసు ఇచ్చిన బీజేపీ కుట్రపూరిత చర్యలను ఎండగట్టడానికి శుక్రవారం మంచిర్యాలలో జై భారత్ సత్యాగ్రహ సభను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, వేణు రాజ్, రాజ నరేంద్రగౌడ్, సంతోష్, అష్రఫ్, నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

20నుంచి బీఈడీ, బీపెడ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధి లో ఇటీవల వాయిదా పడిన బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ (బీపెడ్) మొదటి సెమిస్టరు రెగ్యులర్/బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టరు రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రా రంభమవుతాయని పేర్కొన్నారు.

క్రమబద్ధీకరణ కోసం జేపీఎస్‌ల నిరీక్షణ

- ముగిసిపోయిన నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలం
- రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంలో ప్రభుత్వం తాత్సారం

మోర్తాడ్(బాల్కొండ): ఊరించి ఊసురుమనిపించినట్లుంది జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)ల పట్ల ప్రభుత్వం తీరు. మంగళవారంతో జేపీఎస్‌ల నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలం పూర్తి కానుంది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను జరిపే సమయంలో అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ను అమలు చేస్తారు. జేపీఎస్‌లకు మాత్రం మూడేళ్లు అని ప్రభుత్వం అప్పట్లో తేల్చింది. మూడేళ్లు పూర్తయ్యే సమయంలో మరో ఏడాది ప్రొబేషనరీ కాలం ప్రభుత్వం పొడిగించింది. ఇప్పుడు జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉండగా ప్రభుత్వం కాలయాపన చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా 403 మంది జేపీఎస్‌లు ఉన్నారు. వీరిలో 300ల మంది వరకు నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేశారు. మిగిలిన వారు మధ్యలో ఉద్యోగంలో చేరడంతో వారి కాలం ముగిసిపోవడానికి కొంత సమయం పడుతుంది.

జేపీఎస్‌లకు రూ.28,719 చొప్పున వేతనం చెల్లించారు. రెగ్యులరైజ్ చేస్తే పేస్కేల్ అమలవుతుంది. ట్రెజరీ ద్వారానే వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అందువల్ల నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న జేపీఎస్‌ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల ద్వారా ప్రభుత్వం నెల రోజుల కిందటే సేకరించింది.

ప్రభుత్వానికి పంపించాం

నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకున్న జేపీఎస్‌ల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ఉత్తర్వులను జారీ చేస్తే రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు అందుతాయి. ప్రభుత్వం నెల రోజుల కిందటే వివరాలను తీసుకుంది కాబట్టి తొందరలోనే ఉత్తర్వులు జారీ కావచ్చు. **– డాక్టర్ జయసుధ,** జిల్లా పంచాయతీ అధికారి

ఐటీ హబ్.. ఆశలెన్నో!

- జిల్లాలో మరో కొత్త ఆవిష్కరణ
- 765 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు
- పరోక్షంగా మరో 3 వేల మందికి..
- వచ్చే నెలలో ప్రారంభించనున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఐటీ హబ్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు ఎనిమిది కంపెనీలు ఐటీ హబ్‌లో కార్యాలయాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయి. ఇందులో మల్టీ నేషనల్ కంపెనీలు కూడా ఉన్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగా మంచి ఉద్యోగాలు లభిస్తాయి. స్టార్టప్ కంపెనీల ఏర్పాటు వల్ల ఔత్సాహిక ఆవిష్కర్తలను ప్రోత్సహించినట్లవుతుంది.

– బి. ప్రభాకర్, నిజామాబాద్ డెస్క్



జిల్లా కేంద్రంలో ఏర్పాటవుతోన్న ఐటీ హబ్ స్థానిక ఇంజినీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగుల్లో ఆశలెన్నో పెంచుతోంది. ఐటీ రంగంలో జిల్లాకు తలమానికంగా మారనున్న ఈ ఐటీ హబ్‌లో 765 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మరో మూడు వేల మందికి పరోక్షంగా ఐటీ రంగ ఆధారిత ఉద్యోగాలు లభిస్తాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఐటీ రంగానికి చెందిన మల్టీ నేషనల్ కంపెనీలతో పాటు మీడియం, స్మాల్ కంపెనీలు ఐటీ హబ్‌కు రానున్నాయి. డాటీ ఎంట్రీ, ప్రోగ్రామర్స్, కోడింగ్ డెవలప్‌మెంట్ ఉద్యోగాల్లో కంపెనీలు నియామకం చేస్తాయి. ఇప్పటివరకు 8ఐటీ కంపెనీలు నిజామాబాద్ ఐటీ హబ్‌లో తమ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కంపెనీలు మొత్తం 760 ఉద్యోగాల్లో 60 శాతం ఉద్యోగాల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. జిల్లాకు చెందిన నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ఐటీ ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగం దొరికే పరిస్థితి ఏర్పడనుండటంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐటీ హబ్ ప్రారంభం నాటికి కంపెనీలు ఉద్యోగ నియామకాలు పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. మంచి పేరున్న పెద్ద కంపెనీలు ఐటీ హబ్‌లో కార్యాలయాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలను పలువురు ఉద్యోగార్థులు కోరుతున్నారు. అయితేనే ఉద్యోగాలు లభిస్తాయని అంటున్నారు.

స్టార్టప్ కంపెనీలు..

ఐటీ హబ్‌లో స్టార్టప్ కంపెనీలకు స్థలం కేటాయిస్తున్నారు. ఆ కంపెనీలు కంప్యూటర్‌తో పాటు ఇతర వసతులను కల్పిస్తాయి. ఔత్సాహిక ఇన్నోవేటర్లకు ఇది మంచి అవకాశం.. కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేసే వారికి కంపెనీలు చేయూతనిస్తాయి. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది.

మూడంతస్తుల భవనం..

ఐటీ హబ్ 3.6 ఎకరాల విస్తీర్ణంలో మూడంతస్తుల భవనంలో ఏర్పాటవుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు అన్ని ఫ్లోర్‌లలో కంపెనీలకు స్థలాన్ని కేటాయిస్తున్నారు. రూ. 40 కోట్లతో నూతన కలెక్టరేట్ సమీపంలో కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు పక్కన ఐటీ హబ్ భవనం పూర్తయింది. లోపల ఫర్నిచర్ పనులు, ఇంటీరియర్ వర్క్స్ చేయాల్సి ఉంది. గార్డెనింగ్ పనులు నడుస్తున్నాయి. వచ్చే నెలలో ఐటీ మంత్రి కేటీఆర్ ఐటీ హబ్‌ను ప్రారంభించనున్నారు. అప్పటి వరకు పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచుతున్నారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు



ఐటీ హబ్‌లో ఎక్కువ సంఖ్యలో కంపెనీలకు ప్లేసింగ్ ఇస్తున్నాము. ఇప్పటి వరకు ఎనిమిది కంపెనీలు ముందుకు రాగా, ఐదు వందల మంది ఉద్యోగులు పనిచేసేందుకు ప్లేసింగ్ అడిగాయి. ఇందులో మల్టీ నేషనల్ కంపెనీలు ఉన్నాయి. పూర్తిగా స్థానికులకే ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. స్టార్టప్ కంపెనీలకూ ప్లేసింగ్ ఇచ్చాము. స్థానిక ఔత్సాహిక ఆవిష్కర్తలకు ప్రోత్సాహం లభిస్తుంది. వచ్చే నెలలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఐటీ హబ్‌ను ప్రారంభిస్తారు. **– బిగాల గణేశ్ గుప్తా,** అర్బన్ ఎమ్మెల్యే

ఐటీ హబ్‌తో ఎంతో మేలు



జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఇంజినీరింగ్ విద్య అనంతరం జిల్లా విద్యార్థులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. ఐటీ హబ్ ఏర్పాటు వల్ల వివిధ కంపెనీలు ఇక్కడికే వస్తాయి. ఉపాధి దొరుకుతుంది. విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. **– సాయిరెడ్డి,** కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్, మానిక్‌భండార్

అన్ని కంపెనీలు ఉండాలి



ఐటీ హబ్ ఏర్పాటు హర్షణీయమే కాని ప్రసిద్ధి చెందిన, మల్టీ నేషనల్ కంపెనీలు ఇక్కడికి వస్తే బాగుంటుంది. జిల్లా విద్యార్థులకు కూడా ఉపాధితో పాటు విదేశీ కంపెనీల్లో ఉద్యోగం లభిస్తుంది. హైదరాబాద్, ఇతర దేశాలకు వెళ్లవల్సిన అవసరం ఉండదు. ప్రస్తుత రోజులకు అనుగుణంగా ఐటీ హబ్‌ను తీర్చిదిద్దాలి.
– రమేష్, ఇంజినీరింగ్ విద్యార్థి, నిజామాబాద్

పకడ్బందీగా నిర్వహించాలి



ఐటీ హబ్ ఏర్పాటుతో ఇంజినీరింగ్ విద్యార్థులకు మేలు కలుగుతుంది. ప్రభుత్వాలు మారినా ఐటీ హబ్ పనితీరులో మార్పు రాకుండా పకడ్బందీగా ఉండాలి. మంచి కంపెనీలను తీసుకురావడంతో జిల్లాకు పేరు వస్తుంది. విద్యార్థులకు ఉపాధి లభిస్తుంది. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. సాంకేతిక పరంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి. **– మహేష్,** ఇంజినీరింగ్ విద్యార్థి, నిజామాబాద్



క్లుప్తంగా

కొనసాగుతున్న శిక్షణ



తెయూ(డిచ్‌పల్లి): సామాజిక అవసరాలకు అనుగుణంగా సామాజిక శాస్త్ర పరిశోధనలు చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పాత నాగరాజు సూచించారు. తెయూ క్యాంపస్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సౌతర్న్ రీజనల్ సెంటర్, తెలంగాణ యూనివర్సిటీ భాగస్వామ్యంలో 'ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ / యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా గురువారం ఆయన రిసోర్స్ పర్సన్‌గా అవగాహన కల్పించారు. సామాజిక శాస్త్ర పరిశోధనలో దత్తాంశం యొక్క ప్రాధాన్యతను వివరించారు. పారామెట్రిక్, నాన్ పారామెట్రిక్ స్టాటిస్టికల్ టెక్నిక్స్ ఉపయోగాలను, పరిశోధనలో సమగ్రతను హెచ్‌వోడీ సంపత్‌కుమార్ తెలిపారు. కోఆర్డినేటర్ పున్నయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, దత్తహరి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలు పోస్టర్లను గురువారం తెయూ వీసీ డి రవీందర్ ఆవిష్కరించారు. ఏఎస్ఏ అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 20న క్యాంపస్‌లో నిర్వహించే మహనీయుల జయంతి కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, వెంకటరమణ, సాయిబాబా, అనిల్ నంద, సౌమ్య, శ్రావణి, అపూర్వ, నరేష్, మోహన్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిచ్‌పల్లి ఎంపీవో మృతి


నాగేంద్రప్ప(ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) జంగం నాగేంద్రప్ప (59) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఏడాదిన్నర క్రితం డిచ్‌పల్లి ఎంపీవోగా బదిలీపై వచ్చిన ఆయన ఐదు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. నాలుగు రోజుల క్రితమే తిరిగి విధుల్లో చేరారు. నగరంలోని ఆర్యనగర్ బ్యాంక్‌కాలనీలో నాగేంద్రప్ప అంత్యక్రియలు జరిగాయి. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పునరుజ్జీవనం అయ్యేనా!

- ఖాళీ అవుతున్న ఎస్సారెస్పీ
- కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలని కోరుతున్న రైతులు
- పూర్తయిన పంప్‌హౌస్‌ల నిర్మాణం
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు


సిద్ధంగా ఉన్న మోటార్లు


ఎస్సారెస్పీ వద్ద నిర్మించిన మూడో పంపుహౌస్

బాల్కొండ: యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం తగ్గి వెలవెలబోతోంది. ప్రస్తుతం తరుణంలో కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టును నింపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం నిర్మించిన సంగతి తెలిసిందే.. రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం నీళ్లను వరద కాలువ ద్వారా రోజుకు టీఎంసీ చొప్పున తరలించి 60 రోజులు 60 టీఎంసీలు నింపడమే ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం లక్ష్యం. అందు కోసం వరద కాలువ మీద మూడు పంపు హౌస్‌లను నిర్మించారు. ఇది వరకే కాళేశ్వరం నుంచి రివర్స్ పంపిగ్ ద్వారా వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ వరకు 2019లోనే వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ వద్ద వరద కాలువ గేట్లను కాళేశ్వరం నీళ్లు తాకాయి. కానీ అప్పుడు మూడో పంప్‌హౌస్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రాజెక్టులోకి ఎత్తిపోయలేదు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. అన్ని పంపు హౌస్‌ల నిర్మాణం పూర్తయింది. ప్రాజెక్ట్ కూడా ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది. యాసంగి పంటలకు నీరు అందించడంతో ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 21 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

అనువైన సమయం..

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి సీఎం కేసీఆర్ ప్రాజెక్ట్ వద్ద 2017లో శంకుస్థాపన చేశారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి సిద్ధం చేస్తామన్నారు. కానీ పనులు కొంత ఆలస్యమయ్యాయి. 2019లో కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ వద్దకు చేరాయి. లోపలికి ఎత్తిపోసే అవకాశం లేకపోవడంతో అక్కడి వరకే వచ్చి ఆగాయి. నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోయడానికి ఇది అనువైన సమయం అని పలువురు అంటున్నారు. ప్రాజెక్ట్ నీటి మట్టం 1075 అడుగులు ఉంటే కాళేశ్వరం నీళ్లు ప్రాజెక్టులోకి పోయే అవకాశం లేదు. మూడేళ్ల నుంచి ఎగువ ప్రాంతాల నుంచి సకాలంలో వరదలు రావడంతో కాళేశ్వరం నీరు ఎత్తిపోసే అవసరం ఏర్పడలేదు. కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేక పోవడం, ప్రాజెక్ట నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉండటంతో నీళ్లు ఎత్తిపోయడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని కాళేశ్వరం నీళ్లతో ప్రాజెక్ట నింపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సిద్ధంగా ఉన్నాం

కాళేశ్వరం నుంచి నీళ్లు తరలించుటకు అన్ని పంపులు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే నీళ్లు ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తాం. ఎక్కడ కూడా చిన్న పని పెండింగ్‌లో లేదు.

– సుధాకిరణ్, ఈఈ, పునరుజ్జీవన పథకం

జిల్లా మున్నూరుకాపు సంఘానికి స్థలం కేటాయింపు


మంత్రి కేటీఆర్‌తో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తొలిసారిగా కమిటీ సభ్యులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌ను మంత్రి అభినందించారు. జగన్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం జిల్లా భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన మంత్రి కేటీఆర్ వెంటనే ఫోన్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్‌తో మాట్లాడారు. నగరంలోని వినాయక్‌నగర్ నాలుగో పోలీస్‌స్టేషన్ సమీపంలో 30 గుంటల స్థలాన్ని మున్నూరుకాపు జిల్లా సంఘానికి కేటాయించాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే ఈ భవన నిర్మాణం కోసం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నిధుల నుంచి రూ. 2 కోట్లు, రూరల్ ఎమ్మెల్యే బాజారెడ్డి గోవర్ధన్ నిధుల నుంచి రూ. 3 కోట్లు నిధులు కేటాయించారు. మంత్రిని కలిసిన వారిలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, దాసరి లక్ష్మీనర్సయ్య, గాండ్ల లింగం, దేవేందర్, తిరుమల్, ఏజీపీ యెండల ప్రదీప్, గొర్త రాజేందర్, లక్ష్మణ్ పట్వారీ, రాజు, మధు, పుప్పాలరవి, సంజీవ్, కిషన్, మున్నూరుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డాటా ఎంట్రీ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సహకార సంఘాలు, ఐకేపీ అధికారులతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డాటా ఎంట్రీ సక్రమంగా చేయకుంటే ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం త్వరలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వసతి కల్పించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో పద్మ, జిల్లా సహకార అధికారి వసంత, ఐకేపీ డీపీఎం రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలి



డిచ్‌పల్లి: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ద్వారా ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. గురువారం ఆర్ఎస్ఈటీఐలో మగ్గం వర్క్, టైలరింగ్ కోర్సుల శిక్షణ తరగతులను డీఆర్‌డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో మగ్గం వర్క్, టైలరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. శిక్షణ అనంతరం మహిళ సంఘాల ద్వారా రుణం తీసుకుని సొంతంగా వ్యాపారం ప్రారంభించే సదుపాయం కల్పిస్తున్నట్లు డీఆర్‌డీవో తెలిపారు. సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్, సిబ్బంది రామకృష్ణ, నవీన్, గెస్ట్ ఫ్యాకల్టీ ఫరీద, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన చేపూరి యశోద కూలీ పని కోసం వెళ్లగా సాయంత్రం గుడిసె కాలిపోయింది. చుట్టుపక్కల వారు మంటలను చల్లార్చారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సందర్శించి రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పంచనామా చేశారు. సర్పంచ్ పోతిరెడ్డి ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


సాగవుతున్న కూరగాయల పంటలు

రుద్రూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతవరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. రాబోవు ఐదు రోజుల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, పగటి (గరిష్ట)ఉష్ణోగ్రతలు 40.1 నుంచి 42.3 డిగ్రీల సెల్సియస్, రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు 24.7 నుంచి 28.1డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని వివరించారు. రైతులు పంటల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు 0.2 గ్రాముల థయోమిథాక్సమ్ (లేదా) 0.2 గ్రా.ల అసిటామిప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కూరగాయలు, పండ్ల తోటలకు మధ్యాహ్నం వేళ నీటి తడులు పెట్టొద్దన్నారు. పశువులు, జీవాలను మధ్యాహ్నం వేళ మేతకు తీసుకెళ్లొద్దని సూచించారు.

14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్లను గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి ప్రచారం చేయాలని అగ్నిమాపక అధికారులకు చెప్పారు. జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి సయ్యద్ మహమూద్ అలీ, లీడింగ్ ఫైర్‌మన్ రవీందర్ రెడ్డి, ఫైర్ ఆపరేటర్ సాయిబాబా, అధికారులు సాయిలు, లక్ష్మణ్, శ్రవణ్ కుమార్, వెంకట్, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున ప్రజలను తరలించి విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం టెలి కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల కేంద్రాల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటలకు బస్సులలో ప్రజలను హైదరాబాద్ కు తరలించాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు టిఫిన్, మధ్యాహ్న భోజనం, డిన్నర్, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి బస్సులో ఒక పోలీస్ అధికారి, నోడల్ అధికారి ఉండే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. బస్సులు తిరిగి మండల కేంద్రానికి చేరే వరకు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస రావు, డీఎల్‌పీఓ సాయిబాబా, ఆర్డీవోలు శ్రీనివాస రెడ్డి, శీను, రాజా గౌడ్ పాల్గొన్నారు.

'రాజకీయాల్లోకి రాకముందు నుంచే సేవ చేస్తున్నా'


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాజకీయాల్లోకి రాకముందు నుంచే ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలపై మాట్లాడే అర్హత ఎమ్మెల్యే బిగాలకు లేదన్నారు. కాషాయానికి, కషాయానికి అర్థం తెలియని అసమర్థ ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన సభలో బిగాల తన మీద అసత్య ఆరోపణలు చేశారన్నారు. తాను ఎక్కడ కూడా బిగాలను హనుమంతుడు గుడికి రావొద్దని అనలేదని స్పష్టం చేశారు. హనుమాన్ జన్మదిన శోభాయాత్రకు తొమ్మిదేళ్లుగా ఎందుకు రాలేదని ప్రశ్నించానని, దానికే తనపై ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్లు వాగారన్నారు. ఎమ్మెల్యేకు హిందువుల మీద ప్రేమ ఉంటే వెంటనే శంభుని గుడి చుట్టూ ఉన్న అన్యమతస్తుల దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. తమ ట్రస్ట్ కోవిడ్ సమయంలో రెండు, మూడు రోజులు సేవ చేసి పారిపోయిందని ఎమ్మెల్యే అన్నారని.. ప్రజల వద్దకు వెళ్లి అడిగితే ఎవరు పారిపోయారో చెబుతారన్నారు. నగరంలోని ఏ చౌరస్తాలోకి వచ్చినా మీ కుటుంబం, మా ట్రస్ట్ ప్రజలకు ఏం చేసిందో ఆధారాలతో సహా నిరూపిస్తామని సవాల్ విసిరారు. నిజామాబాద్ అర్బన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా ఇవ్వని అసమర్థ ఎమ్మెల్యే బిగాల అన్నారు. ధైర్యం ఉంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎంతో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ చేశారు. పోతంకర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగొల్ల లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతి రెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, సుక్క మధు, మాస్టర్ శంకర్, సుధీర్, శ్రీనివాస్, కిశోర్, నారాయణయాదవ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా బోధించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ లావణ్య

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులలో ఆసక్తి కలిగించే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, చిన్న చిన్న కథాంశాలు తీసుకొని కథలు రాసే విధంగా ప్రోత్సహించాలని తెలుగు ఆచార్యులు లావణ్య సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో అనుబంధ డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. డిగ్రీ తెలుగు ఐదు, ఆరో సెమిస్టర్ పాఠ్యాంశాలపై ఆచార్యులు అవగాహన కల్పించారు. పదం, పాట, వచన కవిత, లఘు కవితా రూపాలను ఆచార్య త్రివేణి వివరించారు. తెలుగు అధ్యయన పద్ధతులు, సాహిత్య అధ్యయన సంస్కృతి, పుస్తక సమీక్ష తదితర అంశాలను డీన్ కనకయ్య వివరించారు. పత్రిక రచన, ఉపన్యాస కళ అనే అంశాలపై బాలశ్రీనివాస మూర్తి ప్రసంగించారు.

చిత్రంతో నివాళి


పుచ్చకాయపై అంబేడ్కర్ చిత్రం, మామిడికాయపై..

మోర్తాడ్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరిస్తూ ఆయన జయంతి సందర్భంగా మోర్తాడ్‌కు చెందిన చిత్రకారుడు మోత్కు రాము పుచ్చకాయపై అంబేడ్కర్ చిత్రం వేశారు. చిత్రకారుడైన రాము ఎంతో మంది మహనుభావుల చిత్రాలను కళాఖండాలుగా తీర్చిదిద్దాడు.

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని పోచమ్మ గల్లీకి చెందిన ఎడ్ల రుషికేష్ మామిడికాయపై అంబేడ్కర్ చిత్రాన్ని వేశారు. ఆయన గతంలో చాక్‌పీస్, ఎల్ఈడీ బల్బు, తమల పాకుపై అంబేడ్కర్ చిత్రాలు గీచి అబ్బుర పరిచాడు.

టీఎన్జీవోస్ కార్యవర్గాన్ని అభినందించిన కలెక్టర్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా టీఎన్జీవోస్ నూతన కార్యవర్గానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం తన చాంబర్‌లో అభినందించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను టీఎన్జీవోస్ నాయకులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి 16న పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 6 నుంచి 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ వి మేరీ యేసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు www. tswreis. ac. in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా సమయానికి గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం గుర్తించడంలో ఇబ్బందులు ఉంటే హాల్‌టికెట్‌పై ముద్రించిన నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన కరెంట్ తీగ


సంగారెడ్డి మృతదేహం

నిజాంసాగర్: జొన్న చేను కాపలా కోసం వెళ్లిన అటుకుల సంగారెడ్డి (70) అనే రైతు గురువారం ఉదయం కరెంట్ తీగకు బలి అయ్యాడు. వివరాలు.. మండలంలోని సింగితం గ్రామానికి చెందిన అటుకుల సంగారెడ్డి రోజు మాదిరిగా గ్రామ శివారులో ఉన్న జొన్న చేను వద్దకు వెళ్లాడు. చేను పక్కనే మరో రైతు కోతుల బెడద నివారణ కోసం జొన్న చేనుకు ఇనుప కంచెను ఏర్పాటు చేసి కరెంట్ పెట్టాడు. ఒడ్డు పక్కనే కరెంట్ తీగను తాకిన సంగారెడ్డి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం దుర్గవ్వ(40) గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. తమ ప్లాట్‌ను ఇతరులు కబ్జా చేస్తున్నారని మనస్తాపంతో ఆమె గుళికలు మింగింది. అపస్మారక స్థితికి చేరుకున్న దుర్గవ్వను కుటుంబ సభ్యులు గమనించి ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

వృద్ధుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన సయ్యద్ ఇబ్రహీం (70) అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం అతని భార్య సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

సుభాష్‌నగర్: నగరంలోని దుబ్బలోగల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. వారి నుంచి రూ.3680 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాడిన వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన కల్లెడ రమేష్, దేవునిపల్లికి చెందిన కావేటి సంతోష్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

సోలార్ బ్యాటరీల చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

లింగంపేట: మండలంలోని కొయ్యగుండు తండా వద్ద మిషన్ భగీరథ ఫ్లో మీటర్‌కు ఏర్పాటు చేసిన సోలార్ బ్యాటరీలు చోరీ అయినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. బుధవారం రాత్రి బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు ఇన్‌చార్జి ఇంజినీర్ అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో ఏడాది జైలు

ఖలీల్‌వాడి: బాసర నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న రైళ్లలో రెండు సెల్‌ఫోన్లు దొంగలించిన నిందితుడికి రైల్వే కోర్టు ఏడాది పాటు జైలు శిక్ష విధించినట్లు రైల్వే ఎస్సై ప్రణయ్ గురువారం తెలిపారు. సికింద్రాబాద్ రెండో రైల్వే మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి గౌస్ పాషా గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. 2022 ఏప్రిల్‌లో బాసర నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న ట్రైన్‌లో గాజులపేట ప్రాంతానికి చెందిన గాజుల వేణు(20) రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోజారాణి వాదనల మేరకు రెండు సెల్‌ఫోన్‌ల దొంగతనం కేసులు కలిపి ఆరు నెలల చొప్పున మొత్తం సంవత్సరం పాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కోర్ట్ కానిస్టేబుల్ సుధీర్ ఉన్నారని తెలిపారు.